క్లుప్తంగా

నలుగురు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బుధవారం నలుగురు నామినేషన్లు దాఖలు చేశారని ఆర్‌ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. జనవాహిని పార్టీ తరఫున వేమన గణేష్ ఒక సెట్, బీఎస్పీ తరఫున సురేఖ పరమట రెండు సెట్లు, ఇండిపెండెంట్‌గా బేతాల వెంకటేశ్వరరావు ఒకటి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున వంగూరి విజయసత్య ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేసినట్టు వివరించారు. ఏప్రిల్ 25వ తేదీ గురువారం మధ్యాహ్నం మూడు గంటల వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కోసం గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం తెలిపారు. కొంతమూరు గ్రామంలోని కల్యాణ్ నగర్, జంగాల కాలనీ, ఆదర్శ్ నగర్, చందన రమేష్ లేఅవుట్, క్రషర్ ఏరియా, నాలుగో వంతెన తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

యాక్సిడెంట్ కేసుల్లో పరిహారంపై సమావేశం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షతన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రెవెన్యూ, పోలీసులు అధికారులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారన్నారు. మోటారు వాహనాల చట్టం 1998, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ స్కీమ్ 2022 నిబంధనలను అనుసరించి బాధితులకు కమిటీలో ప్రతీ ఒక్కరూ సహకారం అందించాలన్నారు. డివిజనల్ ఏవో ఎస్.సత్యనారాయణరాజు, ఏఎస్ఆర్ జిల్లా మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజేష్‌కుమార్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ




బొర్రా మేఘన జి.వెంకటదుర్గ జె.క్షయర

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు పదో తరగతి పరీక్షల్లో 89.29 శాతం ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ నాగవేణి ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన బొర్రా మేఘన 561 మార్కులు, జి.వెంకటదుర్గ 516, జె.క్షయర 514 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఆరుగురు విద్యార్థినులు 500కు పైబడి మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి తీర్థం

పెదపూడి: గ్రామంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి వారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థానికి మండల నలుమూల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఏలాంటి రవాణా ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. స్థానికులు భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు ఉచితంగా సరఫరా చేశారు.

'ఖేలో' పనులను పరిశీలించిన కమిటీ



వీసీతో సమావేశమైన కమిటీ సభ్యులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో చేపట్టిన ఖేలో ఇండియా ప్రాజెక్టు పనులను మానిటరింగ్ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో రూ.8.30 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కమిటీ చైర్మన్ పి.రామకృష్ణ (స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఏపీ), సభ్యులుగా యువజన, క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన రజత్ చౌహాన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి పి.సతీష్‌కుమార్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ప్రతినిధి ఎస్‌వీ రమణ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇంజినీర్ కె.నూకరత్నం ఆయా పనులను పరిశీలించారు. వీసీ ఆచార్య కె.పద్మరాజుతో సమావేశమై, పనుల ప్రగతిపై సమీక్షించారు.

ఎగసిన జన కెరటం

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ నామినేషన్
- వేలాది మందితో భారీ ర్యాలీ
- రెపరెపలాడిన పార్టీ జెండాలు



పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పాలనకు దాసోహమంటూ.. అభిమాన తరంగం ఎగసిపడింది. జన గోదారి ఏరులై పారింది. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా సాగింది. పార్టీ శ్రేణులు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజల ఆశీస్సులతో రెండు సెట్ల నామినేషన్‌ను కలెక్టరేట్‌లోని జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.తేజ్‌భరత్‌కు అందజేశారు. అంతకుముందు బొమ్మూరులోని రూరల్ నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు.

మిన్నంటిన జై జగన్ నినాదాలు

నామినేషన్ సందర్భంగా చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చేపట్టిన ర్యాలీ పార్టీ కార్యాలయం నుంచి బొమ్మూరు జాతీయ రహదారి, హార్లిక్స్ ఫ్యాక్టరీ మీదుగా కలెక్టరేట్‌కు చేరింది. కడియం, రూరల్ మండలం, నగరపాలకసంస్థ పరిధిలోని వివిధ డివిజన్ల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తల.. జై జగన్ నినాదం మార్మోగింది. డప్పు వాయిద్యాలు, డీజే వాహనం వెంట రాగా, కార్యకర్తలు ఉత్సాహంతో.. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ముక్తకంఠంతో నినదించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ నేతలు నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో ముందుకు సాగారు.

భారీగా హాజరైన పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి డా.గూడూరి శ్రీనివాస్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి, డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, పార్టీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు గిరిజాల వీర్రాజు(బాబు), ప్రముఖ వైశ్య ప్రముఖుడు బొండాడ ప్రభాత్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు, జేసీఎస్ కన్వీనర్లు మంత్రి వేణుగోపాలకృష్ణకు అభినందనలు తెలిపారు. ముందుగా మంత్రి వేణును ఆయన నివాసంలో ఏపీఐసీసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. నామినేషన్ అనంతరం ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజల సంఘం అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం తదితర ప్రముఖులు మంత్రి వేణును కలిసి అభినందనలు తెలిపారు.

రూరల్‌లో వైఎస్సార్ సీపీదే విజయం : వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పెద్దలు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరూ తనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనం కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినిధిగా తాను రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ అభ్యర్థి గోరంట్ల బుచ్చియ్యచౌదరి తనపై చీప్ ట్రిక్స్‌కు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ప్రజలకు గాలికొదిలి, ఇప్పుడు ప్రభుత్వం తనను పట్టించుకోలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి తన హక్కుల ద్వారా ప్రజలకు సేవలందించవచ్చన్నారు. కానీ గోరంట్ల ప్రజలను నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు గోరంట్ల ఇసుక దోపిడీ ఎలా చేశారో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. బీసీల ఓట్లతో గెలిచిన బుచ్చయ్య ఇప్పుడు బీసీ అభ్యర్థి అయిన తనకు ఎమ్మెల్యే టిక్కెట్ రావడంతో జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికల అధికారి జేసీ తేజ్‌భరత్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న అభ్యర్థి వేణుగోపాలకృష్ణ. చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



మంత్రి ఇంటి వద్ద ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణను సత్కరిస్తున్న శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం



వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణ నామినేషన్‌కు బైక్‌లపై ర్యాలీగా వెళ్తున్న అభిమానులు

ఐదేళ్లలో నేను చేసిన అభివృద్ధి చూడండి

- దశాబ్దాల పాటు టీడీపీకి అధికారమిచ్చినా అభివృద్ధి శూన్యం
- నన్ను గెలిపిస్తే నగర రూపురేఖలు మార్చేస్తా
- వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్



ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రెండు దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న టీడీపీ పాలనలో నగరాభివృద్ధి శూన్యమని, ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నగర రూపురేఖలు మార్చేస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం నగరంలోని 7, 12, 37, 10, 35 డివిజన్లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీకి ఎందుకు ఓటు వేయాలో, ప్రతిపక్ష టీడీపీని ఎందుకు వేయరాదో ప్రజలకు వివరించారు. నగర మేయర్లుగా మూడుసార్లు టీడీపీ వారే ఉన్నారని, అదే విధంగా ఎమ్మెల్యేలుగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా పదవులు అనుభవించారే కానీ, నగరానికీ, ప్రజలకూ ఏ మేలు చేశారో చెప్పలేని పరిస్థితి వారిదన్నారు. ఎంతసేపూ రాజకీయాలను అడ్డుపెట్టుకుని ఎలా సంపాదించాలనే ఆలోచన మినహా, నగరాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే తలంపు లేదన్నారు. ఎన్నికల్లో గెలిచేది అడ్డదారుల్లో సంపాదించుకోవడానికి కాదని హితవుపలికారు. గెలిచి అధికారం చేపట్టిన ఐదేళ్లలో మనం ఏం చేశామో ప్రజలకు తెలియాలన్నారు. ఎంపీగా ప్రజలు గెలిపించడంతో, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సహకారంతో నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి, నగర రూపురేఖలు మార్చానన్నారు. మంచి చేయాలనే ఆలోచన, సంకల్పం ఉంటే ఎన్నైనా చేయవచ్చన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్, రైల్వేస్టేషన్ అభివృద్ధి, విమానాశ్రయం, జాతీయ రహదారి అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే చేశానని చెప్పారు. దీనిని టీడీపీ, బీజేపీ నేతలు హేళన చేయడం బాధాకరమన్నారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అప్పుడు టీడీపీ ఎంపీ మురళీమోహన్ ఎందుకు అభివృద్ధి పనులు చేయలేదని ప్రశ్నించారు. 2019లో తాను కాకుండా, టీడీపీ ఎంపీ విజయం సాధించి ఉంటే.. నగరంలో ఈ అభివృద్ధి కూడా జరిగేది కాదన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్‌కు నిధులు సాధించడం వెనుక ఎవరి కష్టం ఉందో తెలుసుకోవాలన్నారు. ఎంపీగా తన పరిధికి మించి నగరంలో అభివృద్ధి చేశానని వివరించారు. ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే, నగరాన్ని విశ్వ నగరంగా అభివృద్ధి చేసి, ప్రపంచ పటంలో ప్రత్యేక గుర్తింపు తెస్తానని హామీ ఇచ్చారు. నగరంలో తాను చేసిన అభివృద్ధి నచ్చితే ఓటు వేయాలని ప్రజలకు ఎంపీ భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో చెల్లుబోయిన నరేన్, అనసూరి పద్మలత తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోలమూరు గ్రామంలో ప్రముఖుడు అయినం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 50 మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ యువ నాయకుడు చెల్లుబోయిన నరేన్, జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మావతి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ప్రతి ఇంటిలో మంచి జరిగిందని, వైఎస్సార్ సీపీకి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. డాక్టర్ అనసూరి పద్మలత మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా బీసీలు అభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని ముందు వరుసలో ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు పడాల వీరప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పరిమి దుర్గారావు, మండల రైతు సలహా కమిటీ సభ్యుడు అల్లాడ వెంకటశ్రీనివాస్, కొంతమూరు గ్రామ అధ్యక్షుడు అత్తిలి భీమశంకరం, ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, మండల రైతు విభాగం అధ్యక్షుడు పిన్నమరెడ్డి సూర్యచంద్రం, రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి ఎంఎం ఆలీ, బీసీ సెల్ నాయకులు మట్టా బాలాజీ, జాన రవి, ఎస్సీ సెల్ నాయకులు కొడమంచిలి కోటిబాబు, బొట్ల వెంకన్న, నాయకులు బాలిన నాగరాజు, బొర్రా అయ్యప్ప, బొట్ల పెంటయ్య, ఆనెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో సీఎం జగన్



జేఎల్బీ నగర్‌లో ఎన్నికల ప్రచారంలో మంత్రి వేణుకు హారతి ఇస్తున్న మహిళలు

బొమ్మూరు ఎన్నికల ప్రచారంలో మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబు అధికారంలోకి వస్తే ఆ పథకాలన్నీ కనుమరుగవుతాయని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి బొమ్మూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జేఎల్బీ నగర్, పంచాయతీ వీధి, కొత్తపేట ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ 2014లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక, ఏ హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ 58 నెలల్లో పేదల బతుకుల్లో వెలుగులు నింపారన్నారు. చంద్రబాబు మోసగాడని దుయ్యబట్టారు. వెనుకబడిన, బడుగు, బలహీన వర్గాల వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలన్నారు. అప్పుడే పేదలకు, ధనవంతులకు మధ్య అంతరం తొలగిపోతుందన్నారు. ప్రజలకు మంచి జరిగి ఉంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా రాజబాబు, ముద్దాల అను, ఎలుగొండ లక్ష్మి, యెనుముల త్యాగరాజు, దాకే శ్రీను, నాగులపల్లి ఆశ, మరడాపు శేఖర్, తెర్లి రమణ, తోడేటి రాజా, కేవీ సుబ్బారెడ్డి, సద్గుణ రామారెడ్డి, అంగాడ సత్యప్రియ, పెయ్యల రాజేష్, నక్కా రాజేంద్ర, షేక్ సమీరా, తోడేటి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అధికారుల నర్సరీ సందర్శన



నర్సరీని సందర్శించిన అటవీ అధికారుల బృందం

కడియం: కడియపులంకలోని శ్రీసత్యదేవ నర్సరీని తెలంగాణ అటవీ శాఖ అధికారుల బృందం బుధవారం సందర్శించింది. అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ నాగినిభాను ఆధ్వర్యంలో 16 మంది అధికారులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా నాగినిభాను మాట్లాడుతూ 22వ బ్యాచ్‌కు చెందిన అధికారుల బృందానికి క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా నర్సరీని సందర్శించినట్టు చెప్పారు. దేశ, విదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమైన ప్రదేశం కడియం ప్రాంతమన్నారు. ఇక్కడ కొన్ని వేల రకాల మొక్క జాతులను అధ్యయనం చేయవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అడవులను అభివృద్ధి చేయడానికి ఉద్యానవన శిక్షకులకు, తెలంగాణ అటవీ శాఖ అధికారులకు ఈ ప్రదేశాలు మేలు చేస్తాయని తెలిపారు. నర్సరీలో ఉత్పత్తి అయ్యే కొన్ని మొక్కల వివరాలను నర్సరీ అధినేత డాక్టర్ పుల్లా చంటియ్య, ఎండీ పుల్లా పెద్ద సత్యనారాయణ వారికి వివరించారు. కార్యక్రమంలో డా. పుల్లా రామకృష్ణ, మెర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్ల మరమ్మతులు పూర్తి



కడియం-దుళ్ల రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న కూలీలు

కడియం: మండల కేంద్రమైన కడియం నుంచి దుళ్ల వరకు సుమారు పది కి.మీ. పరిధిలో రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా పూర్తయ్యాయి. వేదురుమూడి–రాజమహేంద్రవరం ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ఈ రోడ్డు మీదుగా ప్రయాణాలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.35 లక్షల నిధులు మంజూరు చేయడంతో, అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. మూడు వారాల వ్యవధిలోనే మరమ్మతులను పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా మండల కేంద్రమైన కడియం నుంచి వీరవరం వరకున్న రోడ్డులోనూ భారీ గోతులతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని మంత్రి వేణు దృష్టికి తీసుకువెళ్లగా, సంబంధిత అధికారులతో మాట్లాడి, వెంటనే మరమ్మతులు చేపట్టేలా కృషి చేశారు. ఈ మరమ్మతులు పూర్తయ్యి, రోడ్డు అందుబాటులోకి రావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలోని ప్రధాన రహదారుల నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తి కావొచ్చాయి. కడియం నుంచి బుర్రిలంక, వెంకాయమ్మపేట మీదుగా జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇందుకోసం దాదాపు రూ.రెండు కోట్లను కేటాయించారు. తద్వారా ఆయా గ్రామాల ప్రజల రోడ్డు సమస్యకు మోక్షం లభించినట్టయింది.

సాగుకు యంత్ర సాయం

- పండగలా మారిన వ్యవసాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



యంత్రంతో కోస్తున్న వరి పంట

రాజానగరం: అరుగాలం శ్రమిస్తూ పంటలు పండించే రైతన్నల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా రైతుల ఆర్థిక, సామాజిక భద్రతతో పాటు అవసరమైన యంత్రాలను వ్యవసాయ గ్రూపులకు అందజేస్తోంది.

నిరంతర శ్రమ

నాగలితో దుక్కు చేసి, పారలతో దమ్ము చేసి, నార్లు పోసి, కూలీలతో నాట్లు వేయించి, పంట పక్వానికొచ్చిన తరువాత కూలీలతో కోయించి, బల్లకేసి కొట్టి, ధాన్యం గింజలను కళ్లాలలో ఆరబెట్టించి, బస్తాలకు ఎత్తించి, విక్రయించే వరకు అన్నదాతలు శ్రమిస్తూనే ఉంటారు. శ్రమతో పాటు పెట్టుబడులు కూడా అధికంగానే పెట్టాలి. వీరికి యంత్రాల సాయాన్ని అందిస్తే, సాగులో విప్లవాన్ని తీసుకువస్తారని జగనన్న ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలోని ఆర్బీకేల ద్వారా వ్యవసాయంలో యాంత్రీకరణను తీసుకువచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. రైతులతో గ్రూపులుగా ఏర్పాటు చేసి, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తుంది.

40 శాతం సబ్సిడీపై 60 ట్రాక్టర్ల పంపిణీ

రాజానగరం నియోజకవర్గంలో ఏర్పడిన 60 రైతు గ్రూపులకు, ఒక్కో గ్రూపునకు ఒకటి యూనిట్ చొప్పున 60 ట్రాక్టర్లను అందజేశారు. ఒక్కొక్క ట్రాక్టర్ ఖరీదు రూ.8 లక్షలు కాగా అందులో 40 శాతం సబ్సిడీగా లభిస్తుంది.

వరికోత మెషీన్ల మంజూరు

ఎకరం పంటను వరికోత మెషీన్ల సహాయంతో రెండు గంటల్లోపులోనే ఒబ్బిడి చేసుకునే అవకాశం ఉంది. రైతులకు వీటిని సబ్సిడీపై అందించారు. దీని వ్యయం రూ.25 లక్షలు, దానిలో రూ.10 లక్షల సబ్సిడీ ఇచ్చి రైతులకు మంజూరు చేశారు. అలాగే సుమారు 100 గ్రూపులకు కల్టివేటర్, రోటోవేటర్లు అందించారు.

విత్తన శుద్ధికి ఉత్తమ ర్యాంకు

నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. రైతులు ఉచితంగా ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించుకోవచ్చు. కోరుకొండలో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఏర్పాటు చేశారు. రూ.1.67 కోట్లతో ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ నిర్మించారు. రాష్ట్రంలోనే దీనికి ఉత్తమ ర్యాంకు లభించింది.

పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ ఎంతోమంది క్రీడాకారులకు ఆదర్శప్రాయుడని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఇన్నీసుపేటలో సచిన్ 51వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆరు నామినేషన్ల దాఖలు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి ఆరో రోజైన బుధవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ చాంబర్‌లో వైఎస్సార్ సీపీ తరఫున చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చెల్లుబోయిన నరేన్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి వాసంతి చంద్రరావు, బై భీమారావు భారత్ పార్టీ నుంచి గునిపే కిరణ్‌కుమార్, భారతీయ యువజన పార్టీ నుంచి దుగ్గిరాల శ్రీదేవి, భారతీయ చైతన్య యువజన పార్టీ నుంచి చొల్లంగి నాగేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారం

కడియం: మండలంలోని వేమగిరిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేవీజనార్దన్ నగర్, ఇతర ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు.